ఆగని గ్రావెల్ దందా

- అధికార పార్టీ నేతల అండదండలు
- కొండలు పిండి చేస్తున్న అక్రమార్కులు
- దిక్కులు చూస్తున్న విజిలెన్స్, మైనింగ్, రెవెన్యూ అధికారులు



పెదముషిడివాడలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ప్రదేశం

పరవాడ: మండలంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. చీకటిపడితే చాలు గ్రావెల్ దొంగలు రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా పెదముషిడివాడ, దేశపాత్రునిపాలెం, పరవాడ, తాడి ప్రాంతాల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు అధికంగా సాగుతున్నాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో అక్రమార్కులు కొండలు, చెరువులను భారీ యంత్రాలతో కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాల విషయం తెలిసిన అధికారులు మనకెందులే అన్నట్టు వ్యవహరించడంతో మరింత రెచ్చిపోయి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్న పెదముషిడివాడ, తాడి, పరవాడ ప్రాంతాలపై విజిలెన్స్, మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పారిశ్రామిక ప్రాంతంగా రూపుదిద్దుకొంటున్న పరవాడ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అదేవిధంగా ఫార్మాసిటీలో నూతన పరిశ్రమల ఏర్పాటు చేస్తున్న స్థలాలను ఫిల్లింగ్ చేయడానికి, ఇళ్ల పునాదులు ఫిల్లింగ్, రోడ్ల నిర్మాణాలకు, ఇటుకల బట్టీల నిర్వహణకు గ్రావెల్, మట్టిని యథేచ్ఛగా ఉపయోగిస్తున్నారు. దీంతో గ్రావెల్, చెరువు మట్టికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. లారీ గ్రావెల్‌ను రూ.7 వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టరు చెరువు మట్టిని రూ.3 వేలు చొప్పున విక్రయిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలువు దినాలను చూసుకొని మట్టి దొంగలు రాత్రి 11 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు కొండలు, చెరువుల్లో భారీ యంత్రాలతో గ్రావెల్‌ను తవ్వి ఒప్పందం చేసుకొన్న ప్రాంతాలకు తరలించి రెండు చేతుల సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలో పెదముషిడివాడ ప్రాంతంలో రాత్రి పగలు తేడా లేకుండా గ్రావెల్ తవ్వకాలు సాగుతున్నప్పటికీ అధికారులు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబర్లు 323, 367, 408లో నిత్యం అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పరవాడ సర్వే నంబరు 11లో రాత్రి వేళల్లో గ్రావెల్ తవ్వకాలు జరిపి రహస్య ప్రదేశంలో నిల్వ చేసి అధిక రేట్లను విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. దేశపాత్రునిపాలెం ప్రాంతంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడిన యంత్రాలు, లారీని ఇటీవల పరవాడ పోలీసులు పట్టుకొని మైనింగ్ అధికారులకు అప్పగించినా అక్రమ గ్రావెల్ తవ్వకాలకు తెరపడలేదు.

చర్యలు తీసుకుంటాం

అక్రమ గ్రావెల్ దందా అంశం తన దృష్టికి వచ్చింది. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా గ్రావెల్, మట్టి తరలించడం చట్టరీత్యా నేరం. రాత్రి వేళ దొంగచాటుగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు తెలియడంతో వీఆర్వోలను అప్రమత్తం చేశాం. అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

–ఎస్వీ అంబేడ్కర్, తహసీల్దారు, పరవాడ

క్లుప్తంగా

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పరవాడ: మండలంలో సోమవారం నుంచి 31 తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని డిప్యూటీ తహసీల్దార్ సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నరాడు. రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజలకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం భర్నికం, 10న తానాం, 11న వెన్నలపాలెం, 12న చీపురుపల్లి వెస్ట్, 13న చీపురుపల్లి ఈస్టు, 16న మంత్రిపాలెం, 17న రావాడ, 18న పెదముషిడివాడ, 19న ఈ.మర్రిపాలెం, 20న కన్నూరు, 21న తాడి, 23న లంకెలపాలెం, 24న దేశపాత్రునిపాలెం, 26న పి.బోనంగి, 27న కలపాక, 28న ఈదులపాక బోనంగి, 30న స్వయంభూవరం, 31న పరవాడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అప్పన్న సన్నిధిలో దేవదాయ శాఖ కమిషనర్



కమిషనర్‌కు అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ సతీసమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన ఆయన ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ దంపతులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అందజేశారు.

మానవత్వం చాటుకున్న ఎన్టీపీసీ ఉద్యోగి



నిత్యావసర వస్తువులను అందజేస్తున్న ఎన్టీపీసీ ఉద్యోగి లక్ష్మి

పరవాడ: అచ్యుతాపురం మండలం పూడిమడక శివారు కడపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి నూకాలమ్మకు చెందిన పురిల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. దీంతో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయురాలైన నూకాలమ్మకు సింహాద్రి ఎన్టీపీసీలో ఆర్ఎల్ఐ డిపార్ట్‌మెంట్‌లో సబ్ ఆఫీసర్ రుగడ లక్ష్మి సొంత నిధులతో నిత్యావసర సరకులు, రైస్ బ్యాగు, నూనె డబ్బా, పప్పులు, రూ.3 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన మైలపల్లి లక్ష్మణ, గనగళ్ల రాజు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాత వెంకటరరమణ శాస్త్రికి బాండ్ అందజేస్తున్న ఆలయ అధికారులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని సీతమ్మధార దరి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌కి చెందిన పూడిపెద్ది వెంకటరమణశాస్త్రి రూ.1,01,116 విరాళాన్ని నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున పీఆర్‌వో కార్యాలయంలో దాతకు సూపరింటిండెంట్ విక్రమ్, ప్రొటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ అన్నప్రసాద బాండ్‌ను అందజేశారు.

వాడవాడలా సుబ్రహ్మణ్యషష్ఠి వేడుకలు



అడవివరంలోని కల్యాణ వేడుకల్లో వల్లీదేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్న చొక్కాకుల వెంకటరావు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డులోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని తరించారు. వార్డు పరిధి అడవివరంలోని ప్రియాగార్డెన్స్, సింహాచలం దేవస్థానం టోల్‌గేట్, చంద్రాగార్డెన్స్, సింహగిరిపై త్రిపురాంతకస్వామి ఆలయాలు, పాత అడవివరంలోని శివాలయం ఆవరణలో ఉన్న నాగేంద్రుడి ఆలయంలో ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామికి పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, గంగధార జలాభిషేకాలు నిర్వహించారు. అలాగే దేవస్థానం పూలతోటలో ఉన్న నాగేంద్రుడికి, సింహగిరిపై గంగధార వద్ద ఉన్న నాగేంద్రుడికి భక్తులు పెద్ద ఎత్తున అభిషేకాలు నిర్వహించారు.

వైభవంగా వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాలు

సుబ్రహ్మణ్యషష్ఠిని పురస్కరించుకుని చంద్రాగార్డెన్స్, అప్పన్నపాలెంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణాలను వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను వేదికపై వేంజేంపజేశారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతధారణ, మాంగల్యదేవతా పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. కల్యాణ అక్షింతలు, ప్రసాదాన్ని అందజేశారు. అలాగే రెండు ఆలయాల్లోనూ మధ్యాహ్నం అన్న సమారాధనలను నిర్వహించారు. చంద్రాగార్డెన్స్ ఆలయ పూజారులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ ఈకార్యక్రమాలను నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి చొక్కాకుల సాయం

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పంచాయతీ పరిధిలోని శ్రీస్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కలశ ప్రతిష్ఠ, షష్ఠి పూజా మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు స్వామివారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరాలయంలో గ్రానైట్ ఫ్లోరింగ్ ఏర్పాటుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిదిలో ఎర్పాటు చేసిన భారీ అన్నసమారాధనా కార్యక్రమాన్ని ఆయన చేతులమీదగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ఉప సర్పంచ్ గోర్లి అప్పారావు, విశాఖ వెలమ సెంట్రల్ అర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బండారు రామకృష్ణ, బయలపూడి రమణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



పెందుర్తి : ఎమ్మెల్యే పంచకర్ల సమక్షంలో విద్యార్థులకు డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కలిగిస్తున్న సీఐ సతీష్

పెందుర్తి: విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైందని కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్ అన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు కష్టపడి విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నరవలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన 'మెగా పేరేంట్స్, టీచర్స్' సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలు చదువుకునే సమయంలో వారికి అనుకూల వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు.

పెందుర్తిలో..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొని విద్యార్థులకు, తల్లిదండ్రులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. 'డ్రగ్స్ వినియోగం–అనర్థాలు' అనే అంశంపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి సతీష్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కలిగించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● పాతూరు జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలు జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు చేతుల మీదుగా బహుమతులు అందించారు. తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కోట్నివానిపాలెంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశం సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. వేపగుంట, పురుషోత్తపురం, చినముషిడివాడ, ఎస్ఆర్ పురం, జుత్తాడ, సరిపల్లి, ముదపాక, రాజయ్యపేట తదితర పాఠశాలల్లో సమావేశాలు జరిగాయి.

98వ వార్డు పరిధిలో..

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు అధ్యక్షత ఉదయం 9 గంటలకు సమావేశం ప్రారంభమైంది. విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను ఇచ్చి వారి ప్రగతిని వివరించారు. వారి నుంచి సూచనలను తీసుకున్నారు. అనంతరం తల్లులకు ముగ్గులు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు పైడిరాజు పాఠశాల ప్రగతి నివేదికను వివరించారు. ప్రభుత్వం ప్రచురించిన మనబడి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తల్లిదండ్రులతో ప్రధానోపాధ్యాయుడు ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో 98 వార్డు టీడీపీ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ జె.సూరినాయుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అడవివరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయని బి.రాజేశ్వరి ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ ఘనంగా జరిగింది. ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మీహరిణి, ఉపాధ్యాయులు గీత, నాగేంద్రబాబు, గోవిందరావు, మల్లీశ్వరి పాల్గొన్నారు. పాత అడవివరం ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం ప్రసాదరావు, సింహాచల్ గనర్‌లోని ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గేదెల సన్యాసిరావు ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్–టీచర్స్ సమావేశాన్ని నిర్వహించారు.

ఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ..

అడవివరంలోని మహాత్మా జ్యోతీబాపూలే ఏపీ బీసీ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్ ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో 98వ వార్డు కార్పరేటర్ పి.వి.నరసింహం విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమా మోహిని పాఠశాల ప్రగతిని, అభివృద్ధిని వివరించారు. అనంతరం తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఎంసీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించాలి

పరవాడ: ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థులకు బంగారు భవిష్యత్‌ను అందించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. పరవాడ మండలం తానాం గ్రామంలో మాహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల విద్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో కలెక్టర్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జ్ గండిబాబ్జీ పాల్గొన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించడానికి కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పంచకర్ల, టీడీపీ నేత గండి బాబ్జీ , సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ వై.ఎస్.సుహాసిని, జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావునాయుడు, బీసీ సంక్షేమశాఖ ఉప సంచాలకులు కె.రాజేశ్వరి, జెడ్పీటీసీ రాజు, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, ఎంపీటీసీ రొంగలి సునీత, తహసీల్దారు ఎస్వీ అంబేడ్కర్, ఎంపీడీవో శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



పరవాడ: ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పరవాడ మండలంలో

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అతిథులు, దాతలు, పూర్వ విద్యార్థులు హాజరై సలహాలు,సూచనలు అందించారు. మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పాఠశాల హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు, కమిటీ చైర్మన్ లెక్కల సన్యాసి, పరవాడ ఏఎస్ఐ ప్రసాద్‌వర్మ పాల్గొన్నారు.

● పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరేంట్స్ టీచర్స్ సమావేశంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల తమ పిల్లల నడవడికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎస్ఎంసి చైర్మన్ చుక్క ఉమా, కె.శ్రీదేవి, పైల సన్యాసిరావు, రెడ్డి శ్రీనివాసరావు, బండారు రామారావు, కూండ్రపు సోమునాయుడు, హెచ్‌ఎం బొడ్డు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.వెన్నలపాలెం ఎంపీపీ పాఠశాలలో మెగా పేరేంట్స్ సమావేశాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం కుమార్‌రాజు , ఉప సర్పంచ్ సన్యాసిరావు, పైల సన్యాసిరావు, వెన్నల వరలక్ష్మి, వెన్నల నరసింగరావు పాల్గొన్నారు.



జాతీయ జెండాతో ప్రదర్శన చేస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు



పరవాడలో సహపంక్తి భోజనం చేస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

ఉన్నతస్థాయికి ఎదగాలి


సబ్బవరం: దేశాభివృద్ధిలో యువత కీలకం.. వారు ఉన్నత విలువలతో అడుగులు వేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమన్నారు. సబ్బవరం గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు– ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు, ప్రవర్తన, వ్యక్తిత్వం, అభిరుచులను తెలుసుకునేందుకు ఇటువంటి ఆత్మీయ సమావేశాలు చక్కటి వేదికగా నిలుస్తాయన్నారు. మంచి–చెడు విద్యార్థి దశలోనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పినట్టయితే మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, డ్రగ్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పి. కనకరాజు, ప్రిన్సిపాల్ రామకృష్ణ, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సబ్బవరం సీఐ పిన్నింటి రమణ, తహసీల్దార్ బి.చిన్నికృష్ణతో పాటు అధిక సంఖ్యలో విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల జోలికి పోబోమని ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి తదితరులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే పంచకర్ల



అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రధానోపాధ్యాయుడు పైడిరాజు



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి : సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని పెందుర్తి ప్రాంతంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలోని షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పురోహితులు సుబ్రహ్మణ్యశర్మ, రమణ ఆచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణోత్సవం జరిపారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

అలివేలు మంగమ్మ సన్నిధిలో..

చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని మంగమ్మ సన్నిధిలో వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

● వెంకటాద్రి క్షేత్రంపై కొలువుదీరిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో ఆలయ నిర్మాణ కర్త శరగడం చినఅప్పలనాయుడు, అనురాధ దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

దేవీపురంలో..

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధనా పీఠంలో సుబ్రమణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాన్ని పురస్కరించుకోని శనివారం విశేష కార్యక్రమాలను నిర్వహించారు. గుల్లేపల్లి గ్రామంలో శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆహ్వానం మేరకు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్ స్వామివారిని దర్శించుకున్నారు.

ముస్లిం జన గర్జన పోస్టర్ ఆవిష్కరణ

పెందుర్తి: సుజాతనగర్ వేదికగా ఈ నెల 20,21 తేదీల్లో జరగనున్న నూర్ భాషా దూదేకుల ముస్లిం జన గర్జన పోస్టర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆవిష్కరించారు. శనివారం సుజాతనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్జీ, కమిటీ చైర్మన్ షేక్‌ఖాన్ సాహెబ్, ముస్లిం వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నిరసన

పెందుర్తి: సుజాతనగర్‌లోని సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్, సైన్సెస్ కాలేజ్ విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె నాయుడు ఆరోపించారు. ఈ కళాశాలకు గుర్తింపు కూడా లేదన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తుందన్న ఆరోపణల నేపథ్యంలో శనివారం కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం పెందుర్తి సీఐ కె.వి సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహనరావు, ప్రతినిధులు అజయ్, వెంకటరమణ, సాయితేజ, భరత్, నరేష్, అఖిల్ పాల్గొన్నారు.

వెంకన్నను దర్శించుకున్న మాధవ్

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, దీపోత్సవం, దూప సేవ, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నేత పి.వి.ఎన్ మాధవ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు, నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు దర్శించుకున్నారు. భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

పాఠశాలకు రూ.10వేల సాయం



చెక్‌ను అందజేస్తున్న సురేష్ రాజ్

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అవరణంలోని సరస్వతీ దేవి విగ్రహానికి షెడ్ నిర్మాణానికి వైఎస్సార్ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పాలిశెట్టి సురేష్ రాజ్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మెన్ పీలా వరలక్ష్మి, తుమ్మపాల సుగర్స్ మాజీ డైరెక్టర్ మళ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాలో ప్రమాదంపై విచారణ జరపాలి

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో విజయశ్రీ ఆర్గానిక్స్ పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రొడక్షన్ బ్లాక్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఇరువురు కార్మికులకు మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్షతగాత్రులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, టి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష

పెందుర్తి: నియోజకవర్గంలో నిర్వహిస్తున్న నీటి సంఘాల ఎన్నికలు, రెవెన్యూ సదస్సులపై ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి నాయకులతో సమీక్ష నిర్వహించారు. జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్‌లోని ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు. కార్పొరేటర్లు పీలా శ్రీనివాసరావు, బల్ల శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, శానాపతి వసంత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.